ప్రజాశక్తి

మంగళవారం 8 జులై 2025   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

సమస్యలపై గళం విప్పేనా?

- నేడు జిల్లా సమీక్ష కమిటీ (డిఆర్‌సి) సమావేశం
- హాజరుకానున్న ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జరగనుంది. సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అయిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షత వహించనున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు, నీటి పారుదల, పౌరసరఫరాలు, తల్లికి వందనం, కొత్త రేషన్ కార్డులు, స్వర్ణాంధ్ర-2047, ఇతర అంశాలపై చర్చ జరగుతుందని అధికారులు తెలిపారు. జిల్లాకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొంటారు.

ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించి ఇప్పటి వరకు తగిన ప్రణాళిక రూపొందించలేదు. రైతులకు ఏయే పంటలు సాగు చేయాలో వ్యవసాయ శాఖ సూచనలు చేయలేదు. సాగర్ కాల్వలకు నీటి విడుదల, గతేడాది ఎదురైన వరద పరిస్థితులు, మిర్చి, పొగాకు, పత్తి, అపరాల పంటలకు ధరలు బాగా పడిపోయిన నేపథ్యంలో ఈ ఏడాది ఏ పంట వేయాలనే అంశంపై రైతుల్లో అయోయయం నెలకొంది. ఈ ఏడాది ఏ పంటకూ మద్దతు ధరలు లభించలేదని, మిర్చి, పొగాకు, బర్లీ పొగాకు, అపరాల ధరలు గణనీయంగా తగ్గడం వల్ల ఎకరాకు సగటున రూ.లక్ష వరకు నష్టం వచ్చినట్లు రైతులు వాపోతున్నారు. వరి, పత్తి దిగుబడులు కూడా కనీస మద్దతు ధర రాక రైతులు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు నెల పూర్తయినా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు దిశా నిర్దేశం చేయలేదు. ఖరీఫ్ కార్యచరణ ప్రకటించలేదు.

ప్రభుత్వం సంక్షేమ పథకాలు చాలా మంది అందలేదు. తల్లికి వందనం ఖాతాల్లో సొమ్ములు జమకాని వారు ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. కేవలం సచివాలయాల్లో గ్రీవెన్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారే కానీ దీనిపై విచారణకు ఎవ్వరూ రాలేదని తల్లులు వాపోతున్నారు. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ఇంత వరకు ఎవరికి జారీ కాలేదు. గత ప్రభుత్వంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా సంబంధిత అధికారులు ఆన్‌లైన్‌లో ఆమోదం తెలిపిన తరువాత ఆరు నెలలకు కార్డు జారీ చేస్తారని చెబుతున్నారు. దీంతో రేషన్ కార్డుల జారీపై ప్రతిష్టంభన నెలకొంది. స్వర్ణ ఆంధ్రా 2027 అమలుకు సంబంధించి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ మార్గదర్శకుల ఎంపికలో చొరవ చూపడంలేదు. అధికారుల మాట మార్గదర్శకులుగా ఎంపికైన వారు, వ్యాపార వేత్తలు, ధనిక వర్గాలు లక్ష్య పెట్టడం లేదు.

నీటి పారుదల రంగానికి సంబంధించి ప్రస్తుతం కాల్వల మరమ్మతులు జరుగుతున్నాయి. ఒకవైపు నీటి విడుదల ప్రారంభం కావాల్సి ఉండగా మరోవైపు హడావుడిగా మరమ్మతులు చేపట్టారనే విమర్శలు వచ్చాయి. జిల్లా నీటి పారుదల అభివృద్ధి మండలి (ఐడిబి) పునరుద్ధరించి నెలకు ఒకసారి సమావేశం నిర్వహించి రైతుల సమస్యలపై చర్చించాల్సి ఉండగా గత ఐదేళ్లుగా ఈ సమావేశాలు జరగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఇంత వరకు ఐడిబిని పునరుద్ధరించలేదు. జిల్లాలో

▶ 2లో

పెదపరిమిలో రైతులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

భూములివ్వబోమని మైకు ప్రచారం

- రైతుల అభీష్టం మేరకు ప్రభుత్వం నడుచుకోవాలి
- గతంలో ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేశాకే రెండో విడతకు వెళ్లాలి
- సిపిఎం బృందంతో ఆవేదనను పంచుకున్న రాజధాని రైతులు
- భూ సమీకరణ కోసం సభలు పెట్టిన గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణానికి రెండో విడత భూ సమీకరణ కోసం ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించిన పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లో సిపిఎం బృందం సోమవారం పర్యటించింది. భూ సమీకరణపై రైతుల అభిప్రాయాలను సేకరించింది. అనంతరం రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో విలేకర్లతో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడారు. మొదటి విడత భూ సమీకరణలో భాగంగా రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు అభివృద్ధి చేసిన తర్వాతే రెండవ దశపై ప్రభుత్వం ఆలోచించాలని వారన్నారు. మొదటి దశలో భూ సమీకరణ చేసి పదేళ్లకుపైగా గడిచినా రాజధాని ప్రాంతంలో కొందరి రైతుల ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందని చెప్పారు. ప్లాట్లు అభివృద్ధి అయితే

▶ 2లో

వార్తలు లోపలి పేజీల్లో

గుంటూరు జిల్లా మంగళగిరి, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో బైక్ ర్యాలీలు చేస్తున్న వివిధ రంగాల కార్మికులు

రేపటి సమ్మె జయప్రదం కోసం బైక్ ర్యాలీలు

గుంటూరు జిల్లా కలెక్టర్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' పేరుతో గుంటూరు మిర్చిపై జిల్లా కలెక్టర్ ఉద్యాన శాఖ ద్వారా కేంద్రానికి సమర్పించిన ప్రతిపాదనలకు ఉత్తమ జాతీయ బహుమతి వచ్చింది. ఈనెల 14న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుమీదుగా కలెక్టర్ నాగలక్ష్మి అవార్డు అందుకోనున్నారు. ఈ అవార్డును 2023 ఏప్రిల్ 1 నుండి 2024 ఏప్రిల్ 30 వరకూ గుంటూరు జిల్లాలో మిరప పంటను సాగు చేసిన రైతుల వివరాలు, ప్రభుత్వ పరంగా వారికి అందిస్తున్న రాయితీలు, మొదలైన అంశాల గురించి ప్రతిపాదనలు పంపించారు. దీనిలో భాగంగా ప్రధాన మంత్రి కార్యాలయంలోని ఓడిఓపి విభాగం నుండి ప్రతినిధుల బృందం డాక్టర్ ఇషాదీప్, డాక్టర్ దివ్య ఈ ఏడాది జనవరి 10న జిల్లాకు వచ్చి మిరప పరిశోధనా స్థానం, లాం ఫార్మ్, స్పైసెస్‌బోర్డు, మిర్చియార్డు, కోల్డ్‌స్టోరేజిలు, కలెక్షన్ సెంటర్లు, చిల్లీటెస్టింగ్ ల్యాబ్‌లు సందర్శించి, రైతులతో, ఎగుమతిదార్లతో మాట్లాడారు. అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులతో చర్చించారు. అవార్డుకు ఎంపికైనందున కలెక్టర్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలని ఆందోళన

ఎఇకి సిపిఎం ఆధ్వర్యంలో వ్యక్తిగత ఫిర్యాదులు ఇచ్చిన వినియోగదార్లు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎఇకి ఫిర్యాదులిస్తున్న వినియోగదార్లు, సిపిఎం నాయకులు

తమకు చెప్పకుండా బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిడమర్రు టిడ్కో గృహ విద్యుత్ వినియోగదార్లు సోమవారం మంగళగిరిలోని విద్యుత్ ఏడిఈ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సిపిఎం రాజధాని కమిటీ నాయకులు ఎం భాగ్యరాజు, మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, నాయకులు ఎం.బాలాజీ మాట్లాడుతూ ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల విద్యుత్ వినియోగదారులపై వేల రూపాయలు భారం పడుతుందని విమర్శించారు. గత ప్రభుత్వం ఆదానితో చేసుకున్న ఒప్పందాన్ని ఎన్నికలకు ముందు కూటమి తప్పుబట్టిందని,

▶ 2లో

రబీ పంటలను ప్రభుత్వమే కొనాలి

నామమాత్రంగానే కందుల కొనుగోళ్లు - పల్నాడు కలెక్టర్‌కు రైతుసంఘం వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కలెక్టరేట్ వద్ద నిరసనలో రైతులు, నాయకులు

కందులతో పాటు రబీలో రైతులు సాగు చేసిన అపరాలు, ఇతర అన్ని పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద రైతులతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ జిల్లాలో వేలాది ఎకరాలలో కంది సాగు చేశారని, వేల టన్నులు కందులు నిల్వలుండగా మార్క్‌ఫెడ్ ద్వారా నామమాత్రపు కొనుగోళ్లతో సరిపెట్టారన్నారు. నూజెండ్ల మండలం ములకలూరు గ్రామంలో 70 మంది రైతుల వద్ద 200 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. రబీ ధాన్యం

▶ 2లో

నివాళి అర్పిస్తున్న నాయకులు

సిపిఎం నాయకులు దండు రామారావు మృతి

నివాళి అర్పించిన పార్టీ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పాతగుంటూరు, జాకీర్ హుస్సేన్ నగర్ 1వ లైన్‌కు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు దండు రామారావు తన నివాసంలో సోమవారం కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స చేయించుకుంటున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రామారావు, ఆయన సతీమణి ఇరువురు పార్టీ సభ్యులుగా 15 సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. సిపియం నాయకులు ఆయన భౌతిక ఖాయాన్ని సందర్శించి, ఎర్రజెండా కప్పి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలతో మొదటి నుంచి దృఢ సంకల్పంతో ఉండేవాళ్లు తను జీవించినంత కాలం అంకితభావంతో పనిచేశారని, ప్రజాశక్తి చందాదారులుగా ఏ కరపత్రమైనా పూర్తిగా చదివి పదిమందితో చర్చించే వారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, ఎల్. అరుణ, ఎస్.కార్తీక్ టి.శ్రీనివాస్, కె.గంగాధర్, జె.నాంచారయ్య, ఎస్.కె.సైదా, కాసిం షహీద్ పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల్ని అభినందిస్తున్న కొండలరావు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

సుమేధాలో ఘనంగా విద్యార్థి నాయకత్వ కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

ఇష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను అందుకుంటారని దూరదర్శన్ ఆకాశవాణి పూర్వ వార్తా విభాగాధిపతి డాక్టర్ గుత్తికొండ కొండలరావు అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో సుమేధా స్టూడెంట్ లీడర్‌షిప్ కార్యక్రమంలో కొండలరావు మాట్లాడుతూ గాంధీ, కలామ్ వంటి సామాన్యులు అసామాన్యులుగా ఎలా రూపాంతరం చెందారో మనం కూడా అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. గుంటూరు కార్యాలయ జిఎస్‌టి సహాయ కమిషనర్ కె.కేదారేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు తన విజయగాథని తెలియజేసి, వారిని చైతన్యపరిచారు. స్కూల్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు మాత్రమే కాదని, రేపటి నాయకులు కూడా అభివర్ణించారు. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థులు ఎస్‌పిఎల్‌గా డి.మహబూబ్ సుభానీ, ఏఎస్‌పిఎల్‌గా డి.రామ్‌పవన్, గుణశ్రీ అవంతిక పాఠశాల ఎన్నికల్లో గెలుపొందిన వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ఎవికె సుజాత అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ కె.రాంబాబు, ఆనం మెడికల్ హబ్ ఛైర్మన్ ఆనం సంజీవరెడ్డి, ధర్మపీఠం నిర్వాహకులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఎస్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి రాక

ప్రజాశక్తి - రెంటచింతల

కూటమి ప్రభుత్వం ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నేడు రెంటచింతలలో నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి తెలిపారు. మిట్టగుడిపాడు గ్రామం వెళ్లే రహదారిలో పండ్ల మొక్కల పంపిణీ అనంతరం అంబేద్కర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి వివిధ పథకాలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వివరంగా వివరిస్తారన్నారు కూటమి నేతలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు నేతలు.

భూములివ్వబోమని మైకు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

తమకు ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని భావించిన రైతులు రెండవ దశ భూ సమీకరణ ప్రకటనతో అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. వారికి కేటాయించిన భూముల వద్ద రోడ్లు, కాల్వలు, మెరకలు, తాగునీరు, విద్యుత్తు తదితర కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని, ఆ ప్రాంతంలో ఇంకా అభివృద్ధి ఎన్నేళ్ళకు జరుగుతుందోననే సందేహాలు రైతుల్లో ఉన్నాయని తెలిపారు. ప్లాట్ల తనఖాతో బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు కూడా ముందుకు రావడం లేదన్నారు. ఈసారి భూములిచ్చేది లేదని పెదపరిమిలో మైక్ ప్రచారం చేయించారని తెలిపారు. ప్లాట్లను అభివృద్ధి చేసే వరకూ రైతుల అభీష్టం మేరకు సమీకరణను ప్రభుత్వం నిలిపేయాలని, ఈ లోగా అత్యవసరమైన రైల్వే, రోడ్లు తదితర అవసరాలకు సంబంధించి సమీకరించిన భూములకు పరిమితం కావాలని సూచించారు. అమరావతే రాజధానని నిర్ణయిస్తూ పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయకపోవడం వల్ల గత ప్రభుత్వ హయాంలో రాజధాని అస్తిత్వమే సందిగ్ధంలో పడిందని, భవిష్యత్తులో ఇలాంటి వాటికి అవకాశం లేకుండా పార్లమెంట్‌లో చట్టం చేయాలనే డిమాండ్ రైతుల నుండి వస్తున్నట్లు చెప్పారు. రాజధాని ఏర్పాటు సందర్భంగా ఈ ప్రాంత నిరుద్యోగులందరికీ ఇంటికి ఒక ఉద్యోగం కల్పిస్తామని గతంలో హామీ ఇచ్చారని, ఈ ప్రాంతంలో వచ్చే పెద్ద, చిన్న సంస్థలన్నింటిలోనూ స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశా కల్పించడం ద్వారా ఆ హామీని అమలు చేయాలని కోరారు. యూనివర్సిటీలకు ప్రభుత్వం అతి తక్కువ ధరకు భూములిచ్చిందని, ఆ విద్యాసంస్థలన్నింటిలో రాజధాని ప్రాంత విద్యార్థులకు ఉచిత విద్యకు అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు. రాజధాని ప్రాంతంలో జరిగే నిర్మాణాలు అన్నింటిలో స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన భూమిలేని పేదల సామాజిక పింఛనును తక్షణమే పునరుద్ధరించి గతేడాది నుంచి చెల్లించాలని కోరారు. ఉపాధి లేని పేదలకు ప్రభుత్వం ఉపాధి చూపించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు జె.నవీన్‌ప్రకాష్, పి.బాబురావు, కె.ఆంజనే యులు,షేక్ జానీ, డి.గణేష్, ఎం.అంకమ్మరావు పాల్గొన్నారు.

సమస్యలపై గళం విప్పేనా?

(మొదటి పేజీ తరువాయి)

రేషన్ బియ్యం మాఫియా పేట్రేగుతున్నా నియంత్రిచే వారు కరువయ్యారు. రేషన్ మాఫియా నియంత్రణకు సిట్‌ను నియమించినా స్పందన లేదు. జిల్లాలో పరిశ్రమలు, నైపుణ్య శిక్షణపై క్షేత్రస్థాయి పరిశీలన కొరవడింది. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ఆరోగ్యశ్రీ రోగులను కార్పొరేట్ ఆస్పత్రుల వారు ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఆరోగ్యశ్రీకి అమలును పర్యవేక్షణ కొరవడింది. కేవలం ఆస్పత్రుల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో రోగుల వివరాలు నమోదు చేయడం, ఇందుకు సంబంధించి చికిత్స, శస్త్ర చికిత్సలు పూర్తయిన తరువాత వారికి కొన్ని నెలలకు సొమ్ము వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి సొమ్ము ఆలస్యం కావడం వల్ల కూడా చికిత్సల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది ప్రభుత్వం నిర్ధేశించిన సొమ్మునకు అదనంగా కూడా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇలా అనేక శాఖలకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నారని తెలిసింది.

స్మార్ట్ మీటర్లను తొలగించాలని ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని మంగళగిరి నియోజకవర్గంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ప్రచారం చేశారని గుర్తు చేశారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక అదే అదానీ మీటర్లను బిగిస్తోందని, ఆరు నెలలోనే రూ.15వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోకపోతే మరో విద్యుత్ పోరాటాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఎఇకి వినియోగదారుల వ్యక్తిగతంగా ఫిర్యాదులు ఇచ్చారు.

రబీ పంటలను ప్రభుత్వమే కొనాలి

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు అంతంత మాత్రంగానే జరిగినా ఇప్పటికీ నగదు ఇవ్వలేదన్నారు. రైతుల దగ్గర ఉన్న అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎన్నికలప్పుడు నమ్మించిన కూటమి ఇప్పుడు మోసం చేసిందని విమర్శించారు. అప్పులతో సాగు చేపట్టిన రైతులకు పంట చేతికి రాగానే దళారులు ధరలు తగ్గించి రైతులను లూటీ చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నేరుగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిహెచ్.సురేష్, ఆర్.మునివెంకటేశ్వర్లు, రైతులు ఏడుకొండలు, వెంకటరావు, అంజిబాబు, వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం 23వ డివిజన్ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డివిజన్ లో పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకొని, సంక్షేమ పథకాల అమలు గురించి వాకబు చేయగా ప్రజలు జగన్ ప్రభుత్వంలో కన్నా, ఎన్డీయే కూటమి పాలనలో రెట్టింపు సంక్షేమాన్ని పొందుతున్నామని హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ఆటో డ్రైవర్ లను పలకరించగా గత ప్రభుత్వంలో గుంటల మయంగా మారిన గుంటూరు నేడు రోడ్లు వేయటం వలన ప్రయాణం సాఫీగా సాగుతుందని, ప్రమాదాలు కూడా తగ్గాయని తెలిపారు. మాధవి మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం, పెన్షన్ల పెంపుదల పై వివరాలు తెలుసుకుంటున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తాన్నామని, అన్నదాత సుఖీభవ అమలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. టిడిపి నాయకులు లామ్ వర్ధన్ రావు, గంటా మౌలిక, సాధు రాజేష్, మల్లె ఈశ్వర రావు, యాకోబు, నవమి, గోపి, గంధం చలపతి రావు, తోట సాంబశివరావు, సయ్యద్ ఇంతియాజ్, బాబు రావు, మస్తాన్ వలి, అబ్దుల్లా ఖాన్, పులి పద్మి, బుడే భాయ్, బంగారు బాబు, రత్న కుమారి, దిలవార్ షేక్, గంటా సాయి, మొవ్వ వేణు, కందునూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సిఎ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు ప్రకటించిన సిఎ ఫైనల్, సిఎ ఇంటర్, సిఎ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు 10 ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. సోమవారం బ్రాడీపేటలోని సంస్థ మెయిన్ బ్రాంచ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎ ఫైనల్‌లో కె.సాయిరారామారెడ్డి 23వ ర్యాంకు, కె.మోహన్ 26వ ర్యాంకు, సైత్ నిఖిల్‌జైన్ 33వ ర్యాంకు, బి.నాగిరెడ్డి 41వ ర్యాంకు, పి.పూజితరెడ్డి 43వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే సిఎ ఇంటర్‌లో డి.నాగసాయి లక్ష్మణ్ 15వ ర్యాంకు, జె.శరత్‌చంద్ర 29వ ర్యాంకు సాధించారని తెలిపారు. సిఎ ఫౌండేషన్‌లో జి.పూజిత 16వ ర్యాంకు, జి.సాయిపద్మ 17వ ర్యాంకు, పి.సాయిరాఘవేంద్రరెడ్డి 17వ ర్యాంకు సాధించారన్నారు. ఇంతటి మంచి ఫలితాలు సాధించి, మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రేపు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని లోని ఎర్రబాలెం లో సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేబర్ కోడులను ఉపసంహరించుకోవాలని కోరుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో రాజధాని లోని కార్మిక వర్గం అంత పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమ్మెలో భాగంగా తుళ్లూరు, ఉండవల్లిలో ర్యాలీ లు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. కార్పొరేట్ల మెప్పుకోసం కార్మికుల పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను పాలకులు తీసుకు వచ్చారని అన్నారు. కార్మికుల సమరశీల పోరాటాల వల్లనే ఇప్పటివరకు లేబర్ కోడులను కేంద్ర ప్రభుత్వం అమలు

చేయలేక పోయిందని అన్నారు. 2025 సంవత్సరం నుండి లేబర్ కోడులను అమలు చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధమవుతుందని అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడుల వల్ల కార్మికు లు కట్టు బానిసలుగా మారుతారని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత, కార్మిక సంఘాల ఏర్పాటు, గుర్తింపు, సమ్మెకు తో సహా ఆందోళన పోరాటాలు కలిగి ఉన్న హక్కులను లేబర్ కోడ్స్ మింగేస్తాయని అన్నారు. పాలకుల కార్పోరేట్ల అనుకూల విధానాల వలన కార్మికుల జీవితాలు, వారి ఉపాధి దుర్భర పరిస్థితిలోకి నెట్ట బడు తున్నాయని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను, లేబర్ కోడులను తక్షణం ఉపసంహరించుకోవాలని రవి డిమాండ్ చేశారు. ఎన్నో త్యాగాలు చేసి, ప్రాణాలను సైతం బలిదానం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కాల రాసేందుకు ప్రయత్నిస్తే కార్మికులు చూస్తూ ఊరుకోరని పాలకులకు తగిన గుణపాఠం చెబుతా రని రవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి బాబు ఓ రామారావు టి ఆదిలక్ష్మి కే కోటేశ్వరి ఎన్ దివ్య ఎం పార్వతి కొండలు శ్రీను ఆంజనేయులు శివకోటి తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణలో అందరి భాగస్వామ్యం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరును సుందర, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హెూల్డర్స్‌ని భాగస్వాములను చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి సోమవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో మిషన్‌గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై స్టేక్ హెూల్డర్స్, వెండింగ్ కమిటి సభ్యులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నగరంలో విస్తృంగా మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టామన్నారు. రోడ్లు, డ్రైన్లను ఆక్రమణ చేసుకొని ట్రాఫిక్, పారిశుద్యానికి ఆటంకంగా ఉన్న వీధి వ్యాపారులకు త్వరలో వెండింగ్ జోన్ల ఏర్పాటు చేస్తామని, అనంతరం ఆయా ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకోవాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు.కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ సీజన్ లో దశలవారీగా 5 లక్షల మొక్కలను నాటి సంరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నగరంలో ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న వీధి వ్యాపారులను చట్ట ప్రకారం వారి హక్కులకు భంగం కల్గకుండా క్రమబద్ధీకరణ చేస్తూ 2 ప్రాంతాల్లో వెండింగ్ జోన్ల ఏర్పాటు చేశామన్నారు. జోన్లలో వ్యాపారులకు నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించని వారికి గుర్తింపు కార్డులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నగర వెండింగ్ కమిటి నేతత్వంలో గుర్తించిన మరి కొన్ని ప్రాంతాల్లో జోన్ల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, ఏడిహెచ్ జె.శాంతి, ఎంహెచ్ఓ (ఇంచార్జి) రామారావు, స్టేక్ హెూల్డర్స్, రేట్ పెయర్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగుకు రిహార్సల్స్

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో రిహాల్సర్ నిర్వహించారు. బాలికలందరూ యూనిఫాంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (ఎంపీటీఎం) జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ (జెటిపిజిహెచ్ ఎస్) అనే ఆంగ్ల పదాల రూపంలో వినయంగా కూర్చున్నారు. ఈ రిహాల్సర్ చూపరులను విశేషంగా ఆకర్షించినది. పదో తేదీన విద్యార్థి నుల తల్లితండ్రులతో పాటు ప్రముఖులను ఆహ్వానించి నిర్వహించనున్నట్లు ప్రధానోపా ధ్యాయులు ఎస్ శోభాదేవి తెలిపారు.

ప్రస్తుత రోడ్ల స్థితిపై సర్వే

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలంలో ఏయేరోడ్లు ఎలా ఉన్నాయని ఆయా సచివాలయ పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సర్వే నిర్వహిస్తున్నారు. సోమవారం నల్లపాడు పంచాయతీ రాజ్ ప్రాజెక్టు డివిజన్ డిఈ ఎన్. సంపత్ కుమార్ సర్వే ప్రక్రియని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ని తారు రోడ్లు ఉన్నాయి, ప్రస్తుతం అవి ఎలా ఉన్నాయి. మట్టి రోడ్లు ఎన్ని ఉన్నాయి వాటి పరిస్థితి ఎలా ఉన్నాయి ఎన్ని కిలోమీటర్లు మేర రోడ్లు ఉన్నాయి వాటి వెడల్పు ఎంత లాంటి వివరాలు సర్వేలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ఎంత వెడల్పులో ఉంది, అందులో తారు రోడ్డు, మట్టి రోడ్డు ఎంత అన్న వివరాలను నమోదు చేస్తున్నారు.

దళితులంటే టిడిపికి చిన్నచూపు : వైసిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఇటీవల గుంటూరు జిల్లా, పొన్నూరు మండలంలోని మన్నవ గ్రామ సర్పంచ్ నాగ మల్లేశ్వరరావు పై టిడిపి గూండాలు పట్టపగలే నాగ మల్లేశ్వర రావును కొట్టి చంపే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజవరపు నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో దళితులంటే తెలుగుదేశం పార్టీకి చిన్నచూపు అని గతంలో చంద్రబాబు నాయుడు దళితులుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని దళితులను అవహేళన చేసారని ఆయన గుర్తు చేశారు. ఇకపై దళితుల పై దాడులను మానుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలం దొడ్లేరు, హస్సనాబాద్‌లో మొహర్రం వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని, భక్తిశ్రద్ధలతో ఊరేగించే పీర్లను సందర్శించారు. కార్యక్రమంలో కంచేటి సాయిబాబు, మాజీ యార్డ్ ఛైర్మన్ సాంబశివా రెడ్డి, రాము, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

వయోజన (15-59 సంవత్సరాలు) నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ - అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఉల్లాస్ జిల్లా స్థాయి కమిటీ కన్వర్జేన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఉల్లాస్ -అక్షర ఆంధ్ర (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసనం, అవగాహన) అనే కార్యక్రమం ద్వారా సమాజంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ఈ నూతన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి 90,426 మంది నిరక్షరాస్యులను, 2029 నాటికి వంద శాతం వయోజన క్రియాత్మక సాక్షారతను సాధించే విధంగా లక్ష్యం రూపొందించడం జరిగిందన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతోపాటు, జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య లక్ష్యాలని తెలిపారు.

కన్వర్జేన్స్ సమావేశంలో కలెక్టర్, ఇతర అధికారులు

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి శిక్షణలు పూర్తి చేసి తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిరక్షరాస్యులకు ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు రెండు గంటలు చొప్పున వంద గంటలు బోధన నిర్వహించాలన్నారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి 6,887 మంది వయోజనులు నమోదు అయ్యి, వయోజన విద్యాశాఖ, నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్‌స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన ప్రాథమిక అక్షరస్యత మదింపు పరీక్షలో 6333 మంది ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు పొందారన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సూపర్-6 హామీలు గాలికి

ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై వైసిపి ఆగ్రహం

ప్రజాశక్తి - తెనాలి

కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక లెక్చరర్స్ కాలనీలోని ఎం కన్వెన్షన్ హాలులో సోమవారం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షతన 'బాబు షురిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. కొల్లిపర, తెనాలి మండలాలకు చెందిన వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్న సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంబటి రాంబాబు మాట్లాడుతూ అధికారం కోసం అడ్డగోలుగా పొత్తులు పెట్టుకొని, అమలు చేయలేని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. నాయకులు కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, అధికార పార్టీ బెదిలింపులకు బెదిరిపోయేదే లేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్

మాట్లాడుతున్న అంబటి రాంబాబు

మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో వైసిపి అధినేత జగన్ ను మించిన నాయకుడు లేడన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మిన ప్రజలకు మొండి చేయి చూపిందని, మరల వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. ఈ సందర్భంగా 'చంద్రముఖి సూపర్ సెక్స్ ఫ్లాప్' పాటల సిడిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, నాయకులు మన్నవ ప్రభాకర్ ,బూరెల నాంచారమ్మ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహారమే ఆరోగ్య రహస్యం

ప్రజాశక్తి - నరసరావుపేట

మన ఆరోగ్యానికి బలమైన పునాది పోషకాహారమే అని ప్రముఖ డైటీస్ట్ కొత్తా విష్ణుప్రియ అన్నారు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి మరియు దైనందిన శ్రమలకు కావలసిన శక్తిని అందించడానికి సరైన ఆహారం అవసరం అని ఆమె తెలిపారు. పాలు, గింజలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ప్రోటీన్ పదార్థాలు వంటి పోషక విలువలు ఉన్న ఆహారాలను మన రోజువారీ ఆహారంలో చేర్చాలని ఇందులోని విటమిన్లు, ఖనిజాలు, కార్బొహైడ్రేట్లు, కొవ్వులు, ప్రోటీన్లు శరీర పనితీరును మెరుగుపరుస్తాయని అన్నారు. సరైన ఆహార నియమాలు పాటించి అధిక బరువు తగ్గి ఎటువంటి రోగాల భారిన పడకుండా ఆరోగ్యకరంగా జీవించవచ్చన్నారు. త్వరలో ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూరు, నరసరావుపేట లాంటి పట్టణాలలో తమ కేవీపీ న్యూట్రిషన్ సెంటర్ ద్వారా అతి తక్కువ ఖర్చు తో డైట్ సేవలు అందిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 96 పిర్యాదులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం జిల్లా ప్రజల నుండి 96 ఫిర్యాదులు అందాయి. నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. సత్తెనపల్లి నాగన్నకుంటకు చెందిన షేక్.తాహిరా భర్త ఆయన షేక్ హుస్సేన్ రోజు తాగి వచ్చి వేధిస్తున్నట్లు చీటికిమాటికి కొడుతున్నట్లు ఎస్పీని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన బలుసుపాటి కోటయ్య రొంగల ప్రవీణ్ కుమార్‌కు 45,67,500లు ఇచ్చి మోసపోయాననీ, న్యాయం చేయాలని కోరారు.

సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామానికి చెందిన కట్ట నరేంద్ర తనకు తెలిసిన వ్యక్తులు తనకు ఆధార్ సెంటర్ ఇప్పిస్తామని నమ్మించి ఫిర్యాది నరేంద్ర వద్ద నుండి రూ.90వేలు డిపాజిట కట్టించుకుని మోసం చేశారని తెలిపారు. మరికొన్ని ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పి వాటిని పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదులను రాయడంలో పోలీస్ సిబ్బంది సహకరించారు.

మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌ను సమన్వయంతో నిర్వహించండి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో జూనియర్ కళాశాలలో జులై 10వ తేదీన మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ 2.0ను సక్రమంగా నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకొని ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్, హెచ్‌డి బర్లీపొగాకు కొనుగోలు, సిసిఆర్‌సి కార్డుల జారీపై సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌పై విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు స్థానిక పెద్దలను ఆహ్వానించాలన్నారు. సమావేశంలో జేసీ, డిఇఓ సి.వి. రేణుక, విద్యాశాఖ, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ముప్పవరపు కష్ణారావు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎంకెఆర్ ఫౌండేషన్ అధినేత ముప్పవరపు కృష్ణారావు విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. సోమవారం మందడం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 60 మంది విద్యార్థులకు ఆయన సొంత ఖర్చుతో యూనిఫాం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ప్రాధాన్యత కలిగిన కోర్సులను అభ్యసించడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందే వీలుంటుందని అన్నారు. ప్రణాళిక బద్ధంగా చదవడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'తొలి అడుగు' ప్రచారాల్లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - దుర్గి

ఇంటింటికి తొలి అడుగు విజయం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోలగుట్ల కంచరగుంట గ్రామంలో ఎమ్మెల్యే జూలకంటి పర్యటించారు. సీఎం చంద్రబాబు నిరంతర కృషి వలుడని, ఆయన ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఏవో అమీర్ రెడ్డి ఎంఈఓ బెంజిమెన్ , సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుధీర్ కుమార్, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు సంక్షేమ పథకాలు అయిన సూపర్-6 ఇచ్చి ప్రజలకు అనేక సౌకర్యాలు కల్పించారు అని ప్రత్తిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ అన్నారు. సోమవారం ప్రత్తిపాడు మండల పరిధిలోని పాత మల్లయ పాలెం గ్రామంలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం కుర్రి సుబ్బారెడ్డి, పమిడి శ్రీనివాసరావు, కురి శ్రీనివాస్ రెడ్డి, బాగ్యా రావు, కాసు అంజిరెడ్డి, సదాశివరావు పాల్గొన్నారు

ప్రజాశక్తి - నకరికల్లు

కుంకుల గుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఐదవ రోజు ప్రచారంలో తెలుగు దేశం పార్టీ యువ నాయకులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ పాల్గొన్నారు. ఎంపీ కష్ణదేవరాయ, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో నియోజకవర్గంలో, అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. నాయకులు రుసుంకోటయ్య, మరివేముల సిద్దయ్య, సింగరాజు అంక రావు, ఆవుసుబ్బయ్య మాలపాటి మహంకాళి రావు, తాడువాయి శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలం దొడ్లేరు, హసానబాద గ్రామంలో నిర్వహించిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో ఉత్సాహంగా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో నేరుగా ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. 'మై టీడీపీ యాప్' ద్వారా ఫిర్యాదులు నమోదు చేయించారు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మొగల్ జానూ, గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివారెడ్డి, మాజీ ఎంపిటిసి దాచేపల్లి సైదా, హస్సను, ఏ.నాగేశ్వరరావు, బి,మైసూర్‌బాబు, డి.యోహాను, హస్సను, ఏ.వెంకట్రామిరెడ్డి, జి. బాషా,బడే,విష్ణుమూర్తి,వై.రామకష్ణ, పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి కోర్టు
(జూనియర్ డివిజన్), గుంటూరు
ఓ.యస్. నెం. 218/2023

తురకా సాంబయ్య ....వాది

మరియు

తురకా కిరణ్ .... ప్రతివాది

టు,
తురకా కిరణ్, తండ్రి యలమంద, ప్రొక్లెయినర్ ఓనర్, ఆదర్శ నగర్, పిల్లుట్ల రోడ్డు, పిడుగురాళ్ళ, పల్నాడుజిల్లా.

ఈ నెంబరు దావాను వాది మీపై దాఖలు చేసినాడు. సదరు దావాలో ప్రతివాది అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, ఈ పత్రిక ద్వారా మీకు తెలియజేయమని ఆర్డరు వేసినారు. కావున వాయిదారోజు అనగా ది. 15-7-2025 ఉదయం 10-30 గం.లకు పై కోర్టు ఎదుట స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షములో తీర్మానించబడును.

వాయిదాతేది : 15-7-2025

ఎస్.ఆర్.ఆనంద్,
వాది తరపు న్యాయవాది, గుంటూరు.

మహారాజశ్రీ ఎ.పి. కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్
విజయవాడ వారి ఎదుట
O.P. No. 54/2025

Between:
Peoples MACCS Ltd., Vijayawada
Rep.by its C.E.O. - పిటీషనర్

మరియు

కంచర్ల శివకుమారి మరియు 2 ఇతరులు - రెస్పాండెంట్స్

ఆర్డర్ V, రూలు 20, సివిల్ ప్రొసీజర్ కోడ్‌ను అనుసరించి జారీ చేసిన నోటీసు

To
R1 కంచర్ల శివకుమారి W/o. విజయ్ కుమార్, R/o. డోర్.నెం. 4-61, నేలపాడు, పెదరావూరు పోస్ట్, తెనాలి మండలం, గుంటూరు జిల్లా.
R3 కంచర్ల విజయ్ కుమార్, S/o. చిన్నప్ప, R/o. డోర్.నెం. 4-61, నేలపాడు, పెదరావూరు పోస్ట్, తెనాలి మండలం, గుంటూరు జిల్లా.

పై పిటీషన్‌లో 1,3వ ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము ది. 15-07-2025న ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయంగా కానీ లేదా మీ తరపున సరైన వకాలత్ పొందిన న్యాయవాది ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హాజరై పై పిటీషన్‌లో మీ అభ్యంతరాలను తెలియజేసుకోవలెను లేని ఎడల పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(By order of the Hon'ble AP Co-operative Tribunal, Vijayawada)

ఇట్లు
C.V. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ-3.
సెల్: 93999 75668

అధికార పార్టీకి భయపడి కేసులు : పేర్ని నాని

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : రెంటపాళ్ల పర్యటనలో భాగంగా వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నిబంధనలు ఉల్లంఘించారంటూ నమోదైన కేసుల్లో భాగంగా మాజీ మంత్రి పేర్ని నానిపై సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పేర్ని నాని విచారణ కోసం సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌కు సోమవారం వచ్చారు. పోలీసు విచారణ అనంతరం పేర్ని నాని విలేకర్లతో మాట్లాడారు. సత్తెనపల్లి పోలీసులు అమాయకులని, అధికార పార్టీ నాయకులు తప్పుడు కేసులు పెట్టాలంటే వారికి, ఎస్పీ, డిఎస్పీ, సిఐ వంటి ఉన్నతాధికారులకు భయపడి వైసిపి నేతలపై కేసులు పెడుతున్నారని అన్నారు. జగన్‌తో పర్యటనకు రావడం వల్ల తనమీద 11 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఆ నోటీసులు తన ఇంటికి అంటించారని చెప్పారు. పోలీసులు అనుమతించిన మూడు కార్లు, 100 మందిలో తానూ ఒకడినని, అయినా కేసు నమోదు చేశారని అన్నారు. లేకుంటే వారిని బదిలీ లేదా సస్పెండ్ చేస్తామని అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసులు పెట్టి తనను తిప్పుతారేగానీ ఏమీ చేయలేరని, వీటికి భయపడేది లేదని, ఎన్ని కేసులు పెట్టినా జగన్ జెండా వదిలేది లేదని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో సైకో, నరకాసురుని పాలన నడుస్తోందని దుయ్యబట్టారు. ఆయనవెంట వైసిపి సత్తనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సుధీర్‌భార్గవ్‌రెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.

కొనుగోలు తీరుతో పొగుకు రైతుకు నష్టం

ప్రజాశక్తి-చిలకలూరిపేట : మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకును కొంటున్న రాష్ట్ర ప్రభుత్వం నాణ్యతన, ఇతర సాకులతో రకరకాల ధరలు తగ్గించడంతోపాటు కొంత పొగాకును తిరస్కరిస్తోందని, ఇది రైతులకు తీవ్ర నష్టమని కౌలురైతు సంఘంరాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ విమర్శించారు. సరుకును కొనుగోలు కేంద్రానికి తేవడానికి అయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు ఇచ్చిన మాట తప్పారన్నారు. పంట మొత్తాన్ని కొంటామని, ఇందుకు రూ.273 కోట్లు కేటాయించామని చెప్పిన మంత్రి ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో కొనుగోళ్లకు పొంతన ఉండడం లేదన్నారు. కనీస మద్దతు ధర రూ.12 వేలకు తగ్గకుండా కొనాలని, ఆత్మహత్యల బారినుండి రైతులు కాపాడాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, సిసి కెమెరాలు, ఇతర వసతులు కల్పించాలన్నారు.

మామిడి రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : తాతపూడి మామిడికాయలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, రోడ్డుమీద పారబోసే పరిస్థితి నెలకొందని, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని గర్నెపూడి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న ఎమ్మెల్యే మామిడికాయలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. చిత్తూరు తాతపూడి రకం మామిడి పండ్లకు ధరలేక రైతులు పంటను నష్టపోతున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కోసం తాతపూడి రకం కాయలను ప్రజలకు పంచిపెట్టామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, సర్పంచి ఎం.అన్నపూర్ణమ్మ సాంబశివరావు, నాయకులు గజానన, అప్పారావు, రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, హనుమంతరావు, వెంకటకోటయ్య పాల్గొన్నారు.

పిడుగురాళ్ల, నరసరావుపేటలో ర్యాలీలు

రేపటి సమ్మె జయప్రదం కోసం ర్యాలీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే లేబరు కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు, పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అసంఘటి రంగాల కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఉపాధి కూలీలకు, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోటార్ కార్మికులకు నష్ట దాయకమైన జీవో 21 రద్దు చేయాలన్నారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా హరించిందని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న డిఏలు, సరెండర్ లీవ్స్ వెంటనే ఇవ్వాలని, స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. మోడీ ప్రభుత్వం పేదల సొమ్మును దోచుకొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని, ప్రశ్నించేవారి గొంతులు నొక్కుతోందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్లు రాయితీలిస్తూ ప్రజా సంక్షేమం మరిచారన్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై చేపట్టిన మారణకాండను నిలిపివేసి వారితో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.శివకుమారి, సిలార్ మసూద్, షేక్ చిన్న అల్లాబక్షు, కిరణ్, సైదా, సామ్రాజ్యం, వై.వెంకటేశ్వరరావు, ఎన్.రామారావు, బి.శ్రీను, రాంబాబు, పి.జాన్, ఐజాక్, దేవదానం, ఇంద్రయ్య పాల్గొన్నారు.

బెల్లంకొండలో సమావేశం

చిలకలూరిపేటలో పోస్టర్ ఆవివష్కరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల: స్థానిక బంగ్లా సెంటర్ నుండి జానపాడు రోడ్డు, బస్టాండ్, పిల్లుట్ల రోడ్డు, తహశీల్దార్ కార్యాలయం మీదుగా సిఐటియు ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడారు. పని గంటల పెంపు, కార్మికుల శ్రమ దోపిడి చేయడం, సంఘం పెట్టుకునే హక్కును రద్దు చేయడం, తదితర విధానాలను లేబర్ కోడ్‌ల ద్వారా అమలకు కేంద్రం పూనుకుందని విమర్శించారు. స్కీం వర్కర్లు, అసంఘటిత కార్మికులకు పని భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటీ అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. గ్రామీణ ఉపాధిని పట్టణ ప్రాంతానికి విస్తరించాలన్నారు. ర్యాలీలో జి.విజయ్, ఆర్.మధు, పూర్ణ, వి.శ్రీను, ప్రతాపు, జి.నాగేశ్వరరావు, షేక్ బాబు, మహమ్మద్ యూసుఫ్, కె.రాజు, బి.అనిల్, కె.తిరుపతిరావు, ఎం.ప్రతాప్, ఆర్.శ్రీనివాసరావు, జి.పవన్, పి.మోహన్ రంగ, కె.రమేష్, ఎల్.రత్నబాబు ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ : బెల్లంకొండలో సిఐటియు విస్తృత సమావేశం నిర్వహించగా జిల్లా నాయకులు జి.రవిబాబు మాట్లాడారు. అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విజయలక్ష్మి, శోభ, సుందర్రావు, నాగేంద్రం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ట్రాన్స్‌పోర్టు బిల్లును రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 21ను ఉపసరించు కోవాలని ఆటో స్టాండ్ చిలకలూరిపేట డివిజన్ అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు కోరారు. సమ్మె జయప్రదం కోసం స్థానిక కళామందిర్ సెంటర్ వద్ద గల ఆటోస్టాండ్, నరసరావుపేట సెంట్రల్ వద్ద గల ఆటోస్టాండ్, గణపురంలో ఆటోస్టాండ్ ప్రచారం చేశారు. సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. డ్రైవర్లందరికీ సంక్షోమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో కేసులు పెట్టడం మానుకోవాలన్నారు. ఎస్.వెంకట సుబ్బయ, ఎస్.కె.సుభాని పాల్గొన్నారు.

దళితుల భూమి వ్యాపార సంస్థకు కేటాయింపుపై ధర్నా

ప్రజాశక్తి - దుర్గి : దళితులకు గతంలో కేటాయించిన భూమిని అనాలోచితంగా వ్యాపార సంస్థలకు కేటాయించారని, ఆ భూమిని తిరిగి ఇప్పించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దళిత సంఘాలు సోమవారం ధర్నా చేశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల కిందట దళితులు వ్యవసాయం చేసుకోవడానికి అప్పటి తహశీల్దార్ భూమిని కేటాయించారని, అయితే కొంతకాలం కిందట అదే భూమిని పత్రాలు పరిశీలించకుండానే చందనా కేథారిష్ అనే సంస్థకు తహశీల్దార్ కేటాయించారని చెప్పారు. పైగా ఆ భూమి ఎవరికీ చెందినది కాదంటూ ఆన్‌లైన్‌లో నమోదు చేశారని అన్నారు. దీనిపై న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఫణీంద్ర కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఉగ్రవాదుల చెరలో జమ్మలమడక వాసి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

తల్లిదండ్రుల వద్ద వివరాలు నమోదు చేస్తున్న ఎంఎస్ఐ రఫి... అమర లింగేశ్వరరావు(ఫైల్)

అయ్యా.. వాళ్ళు మంచోళ్లు కాదంటా.. ప్రాణాలు తీస్తారంటా.. ఎలాగోలా మావాడ్ని కాపాడండండి అంటూ గద్గద స్వరంతో అమరలింగేశ్వరరావు తల్లిదండ్రులు చేతులు జోడించి వేడుకుంటున్నారు. మాలి దేశంలో ఆరు రోజుల కిందట తీవ్రవాదులు ముగ్గురు భారతీయులను కిడ్నాప్ చేశారు. వారిలో మాచర్ల మండలం జమ్మలమడకకు చెందిన కూరాకుల అమర లింగేశ్వరరావు ఉన్నారు. హైదరాబాద్ డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే లింగేశ్వరావు ప్రమోషన్‌పై 11 ఏళ్ల క్రితం ఆఫ్రికాఖండంలోని మాలి దేశానికి వెళారు. తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మిలు జమ్మలమడకలో నివాసం ఉంటుండగా, భార్య, ముగ్గురు పిల్లలు తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెంలో ఉంటున్నారు. మాలీ దేశంలోని డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీ అసిస్టెంట్ మేనేజర్‌గా అమర లింగేశ్వరరావు పనిచేస్తుండగా, ఈ నెల ఒకటో తేదీన ఉగ్రవాదులు ఫ్యాక్టరీలోకి ప్రవేశించి మేనేజర్ గురించి వాకబ్ చేశారు. అప్పుడే బయటకు వచ్చిన అమర లింగేశ్వరరావుతో పాటు ఒడిశాకు చెందిన వెంకట రమణ, రాజస్థాన్‌కు చెందిన ప్రసాద్ అనే ఉద్యోగులను ఉగ్రవాదులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు వారి జాడ తెలియక పోవటంతో కుటుంబ సభ్యులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. అల్‌ఖైదా అనుబంధ సంస్థ జెఎన్ఐఎం ఉగ్రవాద సంస్థ కిడ్నాప్ చేసినట్లు తెలియవచ్చింది. వారి చెర నుండి తమ కుమారుడిని తప్పించాలని తల్లిదండ్రులు వేడుకొంటున్నారు. మాచర్ల రూరల్ ఎఎస్ఐ రఫీ జమ్మలమడకలోని అమర లింగేశ్వరరావు తల్లిదండ్రులను కలసి వివరాలు సేకరించారు.

పరిష్కరించకుంటే 12 నుండి సమ్మె

గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికుల మానవహారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వేతనాలు పెంచి, దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మూణ్ణెల్లుగా ఆందోళన చేస్తున్నా, యూనియన్ నాయకుల ద్వారా రాయబారం పంపిణీ కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్దగల మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ సోమవారం కార్మికులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 12 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నా 11 ఏళ్ల నుండి కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. కార్మికులు సమ్మెలోకి వెళితే ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వం, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. జీఓ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్మికులపై అధికారుల, రాజకీయ వేధింపులు ఆపాలని, పెరిగిన పట్టణీకరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు చిన అల్లాబక్షు, సోమశేఖర్, సామ్రా జ్యం, నాగయ్య, మాలిక్, రంగా, బి.శ్రీను, కె.శ్రీను, సింగ్, నాగరాజు, రమేష్, వెంకటేశ్వర్లు, వాసు, ఖాదర్, కిరణ్ పాల్గొన్నారు.

తాడేపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, తాడేపల్లిలో బైక్ ర్యాలీ, దుగ్గిరాలలో సమ్మెనోటీసు అందజేస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రచార హోరు

ప్రజాశక్తి - తాడేపల్లి

అఖిలభారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జరగనున్న ట్రేడ్ యూనియన్ల బందును తాడేపల్లి పట్టణంలో ప్రజలు జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో జరిగిన సిపిఎం పట్టణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి జి.సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. నేతాజీ మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకుందాం కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకొస్తుందని మండిపడ్డారు. 8గంటల పని విధానం స్థానంలో 12 గంటల నుండి 14 గంటల పని విధానం తీసుకొస్తున్నారు అని విమర్శించారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దూషి పెట్ట దానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి, డి.విజయభాస్కర్ రెడ్డి, ఘర్షణకు విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ..

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిలో సిఐటియు, ఐఎన్‌టిసి, వైఎస్ఆర్‌టియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీ ప్రకాష్ నగర్ లోని సిఐటి ఆఫీసు నుండి చేపల గోడౌన్, బిజినెస్ పార్క్,మందుల తయారీ కంపెనీ,మోర్, హిందుస్థాన్ పెట్రోల్ కార్పొరేషన్ లిమిటెడ్, సర్వో ఆయిల్ కంపెనీ,పెట్రోల్ బంకులు, ఇ మిస్ కంపెనీ, ఇన్ కాప్ కంపెనీ, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఇండియన్ బ్యాంక్ మీదగా ఉండవల్లి సెంటర్, తిరిగి ప్రకాష్ నగర్ కార్యాలయం వరకు సాగింది. సిఐటియు కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడారు. సమ్మెలో తాడేపల్లి పట్టణంలోని అన్ని రంగాల సంస్థల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బురుగ వెంకటేశ్వర్లు, జి సుబ్బారెడ్డి, డి.విజయ బాబు, నరసింహారావు, నీరు దుర్గారావు, కోట బాబురావు, విజయ్, ఐఎన్టీయూసీ నాయకులు దర్శన సామేలు, వైఎస్ఆర్ టియు నాయకులు శ్రీనివాసరాజు, ఎసిసి యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, సూర్య ప్రకాష్, అంకయ్య, భాషా, వేముల వెంకటేశ్వరరావు, ఇశ్రాయేలు, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, సాంబయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పట్టణంలో సోమవారం సాయంత్రం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. సిఐటియు, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టియు న్యూ, వైఎస్సార్ టియుసి ఆధ్వర్యంలో మంగళగిరి అంబేద్కర్ సెంటర్ నుండి ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీని సిఐటియు సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జవహర్‌లాల్, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, అధ్యక్షులు వై.కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, వివిధ కార్మిక సంఘాల నాయకులు ట.శ్రీరాములు, ఎస్.గణేష్, షేక్ జానీభాష, ఎస్.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ, ముక్కంటి, యు.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఏఐఎఫ్‌టియున్యూ నాయకులు కె.కోటేశ్వరరావు, ప్రసాద్, వైఎస్సార్‌టియుసి నాయకులు ఎస్.శ్రీనివాసరాజు, ఎన్.నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు సెంట్రల్ వేరు హౌస్ మేనేజర్‌కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, ముఠా కార్మికులు శ్యాంబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లి మండల సిఐటియు నాయకులు ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు, చిర్రావూరు, వడ్డేశ్వరం, కొలనుకొండ సచివాలయాలలో సోమవారం అధికారులను కలసి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, చొక్కా మరియాదాస్, బండ్ల హనుమంతరావు, బండ్ల రవి కుమార్, ప్రాతూరు నాగేశ్వరరావు, మోపర్తి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.భావన్నారాయణ పిలుపునిచ్చారు సోమవారం కొల్లిపర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండలంలోని వివిధ రంగాల కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు నిర్మల జ్యోతి అధ్యక్షత వహించారు. సమావేశంలో కోటా చంద్రశేఖర్, గోదాసుందరరావు, రమేష్, సిహెచ్ సీతమ్మ, వసంత కుమారి, సంతోష్ కుమారి,ఎస్.కె.జైన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆత్మకూరులో కరపత్రాలు పంపిణీ చేశారు. వివిధ సంఘాలు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ ఆఫీసులకు, స్కూళ్లకు, బ్యాంకులకు, సమ్మె నోటీసులు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పండల ప్రసాదు, జాలాది జాన్ బాబు, వుద్దంటి దుర్గారావు, జాలాది నాగేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, పంతగాని మరియదాసు, గాలి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమ్మెలో విద్యుత్ కార్మికులు పాల్గొనాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో యుఈఈయు, ఎపిసిపిడిసిఎల్ కమిటి డి వెంకటేశ్వరరావు యూనియన్ గౌరవ అధ్యక్షులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడారు. జులై 9న జరిగే సమ్మెలో విద్యుత్ కార్మికులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, నాగరాజు, రోహిణి కుమార్, శివకుమార్, శివ నాగేశ్వరరావు, ఘని తదితరులు పాల్గన్నారు.



చిర్రావూరులో సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు. కొల్లిపరలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియూ నాయకులు భవనారాయణ, సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

మీ ఇండ్లకు కరెంటు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నాగులపాడు, పెదనంది పాడు, వరగాని గ్రామాలలో స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాల గురించి కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మన ఇళ్లల్లో బాగున్న కరెంటు మీటర్ల తొలగించి, ఆదాని కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తున్నారని, అనుమతి లేకుండా మోసపు మాటలు చెప్పి బెదిరించి మీటరు మార్చుతారని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వాణిజ్య దుకాణా లకు మార్చడం జరిగిందని, ఇప్పుడు ఇళ్లకు బిగించడానికి వస్తున్నారని తెలిపారు. ఈ మీటర్ల వలన శాశ్వతంగా మనపై విపరీతమైన భారాలు పడి, క్రమంగా విద్యుత్ పంపిణీ ఆదాని లాంటి బడా కంపెనీల చేతిలోకి వెళ్లబోతుందని వివరించారు. ఈ మీటర్‌తో సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాలని, ఇంటికి వచ్చి రీడింగ్ తీయడం బిల్లు ఇవ్వడం ఉండదని తెలిపారు. ఆదానీని బాగు చేయటానికి మన ఇంట్లో మీటర్ ఎందుకు పెట్టుకోవాలని ప్రశ్నించారు. కరెంటు చార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే 15 వేల కోట్ల రూపాయలు పైగా సర్దుబాటు చార్జీల రూపంలో భారాలు వేశారని చెప్పారు. గతంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని చెప్పిన తెలుగుదేశం నాయకులు నేడు మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇవ్వటం ఎంతవరకు సమంజసమన్నారు. బడా కంపెనీలకు దోచిపెట్టడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలది ఒకటే దారి అని అన్నారు. రైతుల పంపుసెట్లకు మీటర్లు బిగించడానికి వస్తే రైతులు ఎదురు తిరిగారని, అందువల్ల పంపుసెట్లకు మీటర్ల బిగించడం ఆపారని వివరించారు. ఆ ప్రకారం ఆదాని స్మార్ట్ మీటర్ల మీద పోరాటం చేసి అడ్డుకుం దామని పిలుపునిచ్చారు. అనంతరం పెదనందిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరిముల్లా, విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర, రైతు సంఘం నాయకులు కన్నెగంటి చంద్ర రావు, పి.భువనేశ్వరి, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు.

వరగాని గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, డిప్యూటీ తహశీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వినతి పత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి శివాజి

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి శివాజీ డిమాండ్

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకాని మండలంలోని పలు గ్రామాలలో ఎన్నో ఏళ్ళుగా పరిష్కారం కానీ సమస్యలపై సోమవారం సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు ఛానల్ కాలువ తాడేపల్లి సీతానగరం నుండి ప్రవహిస్తూ పెదకాకాని మండలం మీదగా వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు వరకు 47 కిలోమీటర్లు విస్తరించి ఉండి 33 గ్రామాల ప్రజలకు త్రాగు,సాగునీరు అందిస్తుందని, గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు పొలాలకు అనేక చోట్ల గండ్లు పడి రైతులు తాము పండించిన పంటను కోల్పోయారు అన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న ఇంతవరకు కాలువ పటిష్టతకు కనీస చర్యలు చేపట్టలేదు అన్నారు. పెదకాకాని నుండి గోళ్ళమూడి వెళ్లే రోడ్డు వద్ద కాలవ కట్టకు నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరిందని, కాలువ మొత్తం గుర్రప డెక్క పేరుకుపోయి ఉండడంతో గడ్డిమందు పిచికారి చేశారన్నారు. గడ్డి మందు పిచికారి చేయడం వలన గుర్రప డెక్క తూటి కాడ కుళ్ళి కాలవలో నీరు మొత్తం విషపూరితంగా మారే అవకాశం ఉంది అన్నారు. పెదకాకాని సుందరయ్య కాలనీలో 2007 సంవత్సరం నుండి 310 కుటుంబాలు ఇండ్లు నిర్మించుకొని 1200 మంది నిరుపేదలు ఎస్సీ .ఎస్టీ. బీసీ. మైనారిటీ జనాభా నివాసం ఉంటున్నారని వెంటనే వారికి ఇళ్ల పట్టాలు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బి.సాంబయ్య, బి. నాగలక్ష్మి, వి.మల్లేశ్వరి, ఏ.నాగేశ్వరరావు, ఆర్.వెంకట రమణ, ఎస్.కె.ఇస్మాయిల్, కె.రాజేశ్వరి, జాన్ బి, పర్వీన్, ప్రమీల, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

216వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 216వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో షేక్ ఇమాంబీ, మొలకశారద, దేరంగుల రమణమ్మ, డి.సువర్ణకుమారి, జి.అన్నమ్మలు కూర్చున్నారు. దీక్షలను కె.స్టీవన్, మల్లె. గురవయ్యలు ప్రారంభించారు. కార్యక్రమంలో వై.సాంబశివ రావు, యహెూషువ, ఇజ్రాయిల్, బి.సూర్యప్రకాశరావు, సిహెచ్. పిచ్చయ్య, ఎన్.సుబ్బారావు, బిఅంకయ్య, ఆరిఫ్, ఎం.ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరావు, హగ్గయ్య, షైక్ బాషా, ఇస్మాయిల్, జిలగా వెంకటేశ్వర్లు, దామవరపు నాగేశ్వరావు మరియు మహిళలు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండల పరిధిలోని తూములూరు గ్రామ సెంటర్ నందు స్కూల్ బస్సును ఇసుక లారీ ఢీకొన్న ఘటన సోమవారం నెలకొంది స్థానికుల కథనం ప్రకారం కొల్లిపర నుండి ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థులతో బయలుదేరి తూములూరు సెంటర్ నందు మలుపు తిరుగుతుండగా హనుమాన్ పాలెం నుండి ఇసుకలోడుతో వస్తున్న లారీ స్కూల్ బస్సును వెనక భాగంలో స్వల్పంగా ఢీ కొట్టింది ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేసిన లారీ డ్రైవర్ లారీని వేగంగా వేరొక వైపుకు తిప్పడంతో ఘోర ప్రమాదం తప్పినది ఈ ప్రమాదంలో విద్యార్థులు క్షేమంగా ఉండటంతో తల్లిదండ్రులు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మెగా పేరెంట్స్ మీట్‌కు పటిష్టమైన ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో ఈనెల 10న నిర్వహించనున్న 'మెగా పేరెంట్స్ మీట్'నకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ పిఅరుణ్ బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫామ్‌లో రావాలని సూచించారు. భోజన సదుపాయాలతో ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తగా తయారు చేయాలన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు విద్యార్థులచే పాఠశాల ఆవరణలో నాటించాలన్నారు. కార్యక్రమంపై ఫోటో సెషన్ నిర్వహించాలని అమ్మ ప్రాముఖ్యతను తెలిసేలా తల్లికి వందనం నిర్వహించాలన్నారు. కార్య క్రమం ఏర్పాట్లు, నిర్వహణ లీప్‌యాప్'లో పొందుపరచాలన్నారు.

ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగల ముఠా

సుమారు రూ.13 లక్షల సొత్తు చోరీ

ఘటన స్థలాన్ని పరిశీలించిన పట్టణ పోలీసులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక శారదా మున్సిపల్ స్కూల్ బజార్‌లో తెల్లవారు జామున జరిగిన దొంగతనం ఘటనలో ఇల్లు మొత్తం దొంగలు కలియ తిరిగి ఇష్టమొచ్చినట్లు సామాన్లు చిందర వందర చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పట్టణ సిఐ రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం. పట్టణంలో శారదా జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోని ఇమ్మడి కృష్ణ చైతన్య ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు కృష్ణ చైతన్య తెలిపిన వివరాల ప్రకారం వారి కుటుంబ సభ్యులు అందరూ కలసి ఇంటికి తాళాలు వేసి శనివారం రాత్రి అవని గడ్డలోని బంధువుల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. అనంతరం సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళాలు, పగల కొట్టి ఇల్లు మొత్తం చిందర వందరగా ఉండ టంతో పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. ఇంట్లో సుమారు రూ.2.75 లక్షల నగదు, 70 గ్రాముల బంగారం, 3కిలోల, వెండి 40 వరకు పట్టు చీరలు చోరీ అయినట్లు వారు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సిఐరమేష్ తెలిపారు.

వరికపుడిసెల ప్రాజెక్టు పనులెప్పుడు చేపడతారు? : బిఎస్‌పి

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు ప్రజల దశాబ్దాల కలైన వరికపుడిశెల ప్రాజెక్టు పనులు ఎప్పుడు మొదలు పెడతారో చెప్పాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుండాల సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని మాచర్ల నియోజకవర్గంతో పాటు ప్రకాశం జిల్లా కొన్ని మండలాలు సాగు తాగు నీటి కోసం నాలుగు దశాబ్దాలుగా పాలకులు బూటకపు మాటలతో ఇక్కడ ప్రజలను మభ్యపెడుతున్నారని, ప్రాజెక్టు నిర్మించి ఓట్లు అడగడానికి ముందుకు వస్తానని చెప్పిన ఒక పెద్దమనిషి, ఈ ప్రాజెక్టు నేను మాత్రమే చేయగలనని హామీతో గెలిచిన నేటి పాలకులు ప్రాజెక్టు ప్రగతి ఏంటో పల్నాడు ప్రాంత ప్రజలకు సమాధానం చెప్పి తీరాలన్నారు. "వరికపుడిశెలా.. నీ జాడ ఎక్కడ" అనే కార్యక్రమం ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమం చేపడుతామని తెలియజేశారు. సైదులు యాదవ్, పట్టణ అధ్యక్షులు పఠాన్‌జాని, జిల్లా కార్యదర్శి పూసలపాటి మల్లికార్జునచారి పాల్గొన్నారు.

మైనింగ్ అక్రమ కార్యకలాపాలను అరికట్టండి : కలెక్టర్

ప్రజాశక్తి - నకరికల్లు

జిల్లాలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, గ్రావెల్ తవ్వకాలపై అమతంలో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, మైనింగ్, అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి .అరుణ్ బాబు ఆదేశించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని సోమవారం కలెక్టర్ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా నకరికల్లు మండలం నుంచి రీఓపెన్ అయిన అర్జీలు, ముటేషన్లు, రీసర్వే, ఇళ్ల స్థలాల దరఖాస్తుల పరిశీలన, ఇండ్ల నిర్మాణాల రెగ్యులైజేషన్, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై తహశీల్దార్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో వీఆర్వోలు సర్వేలు తప్పనిసరిగా పాల్గొనాల ని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్ రెడ్డి, జిల్లా మైన్స్ మరియు జియాలజీ అధికారి నాగిని, సర్వే ఏడి భాను కీర్తి, తాహాసిల్దార్ పుల్లారావు, డిటి కొండారెడ్డి పాల్గొన్నారు.

భూమిలేని నిరు పేదలకు భూమిని పంచాలి : వ్య.కా.సం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కోసూరు మండలం పెరికపాడు గ్రామంలో ఉన్న అన్ సర్వే భూమిని అర్హత కలిగిన భూమిలేని పేదలకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెరికపాడు గ్రామంలో భూమిలేని పేదలు పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రవిబాబు మాట్లాడుతూ క్రోసూరు మండలం పెరికపాడు గ్రామంలో గతంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన ఫలితంగా రెవెన్యూ అధికారులు గ్రామ సరిహద్దుకు అడవికి మధ్య అన్ సర్వే భూమి ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని ఆ భూమిని గ్రామంలో భూమి లేని పేదలకు పంచాలని వివిధ రూపాలలో ఆందోళన చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని అర్హత కలిగిన భూమి లేని పేదలకు భూమిని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు ముత్యాల పౌలు పేదలు కుంభా శివకోటేశ్వరరావు, జడా రామారావు,ఆముదాలపాటి రూబేను, చింతగుంట్ల విజయ్ భూమి లేని కౌలు రైతులు పేదలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వ్య.కా.సంఘం

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్ల గురించి మాట్లాడుతూ మీటర్లను పగులగొట్టం డని చెప్పి ఇపుడు మాట మార్చడం సరికాదని పిడిఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరుతూ నరసరావుపేట పట్టణం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి అధికారంలోకి రాగానే అదానితో ఒప్పందాలు కుదుర్చుకుని ప్రజలపై విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు భారాలను బలవంతంగా అంటగడుతున్నారన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు అంటూ ఇంటింటికి వస్తున్న కూటమి నేతలను ప్రజలు స్మార్ట్ మీటర్లపై,సర్దుబాటు ఛార్జీల పై నిలదీయాలని పిలుపునిచ్చారు. పిడిఎం నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, బిసి నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పిడిఎం సీనియర్ నాయకులు

కూటమి ప్రభుత్వానికి అండగా ఉండండి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ఎస్‌సి వర్గీకరణకు సాయం అందించిన కూటమి ప్రభుత్వానికి మాదిగలు అండగా ఉండాలని ఎం.ఎల్.ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఎంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, ఎంఆర్‌పిఎస్ నేత మంద క్రిష్ణమాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఉదయం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎంఎల్ఎ సంఘనాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు తొలి నుండి చంద్రబాబు నాయుడు మద్దతుగా ఉన్నట్లు తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ చట్ట రూపందాల్చే క్రమంలో కూటమి ప్రభుత్వానికి మాదిగలు తమ సహకారం అందించా లన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మదార్ సాహెబ్, నాయకులు మాచర్లవాసు, మాచర్ల రూబేన్, దానియేలు, పుల్లారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

యంఆర్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ అడుగుజాడల్లో యువత పయనించి రాజ్యాధికారం కోసం మరో పోరాటం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ పల్నాడు జిల్లా కోశాధికారి కంచర్ల జాన్‌బాబు అన్నారు. సోమవారం మహాజన సోషలిస్టు పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు వేమవరపు జీవన్ మాదిగ యంఆర్పీయస్ జెండా ఎగురవేశారు. బంకా రాజారావు , కంచర్ల సుబ్బారావు, రావెలపవన్, కంచర్లవినయ్ జస్వంత్, తాళ్లూరి చింతయ్య, తాళ్లూరి చక్రవర్తి, కంచర్ల థామస్, మేకల నరేష్ ,ఇనుముక్కల దావీదు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోజెండాను ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు ఎంఎస్పీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గడిపర్తి శ్రీనివాసరావు మాటాడారు. పెద్దసామ్యూల్ ఐజాక్ ఇసాక్ జకరయ్య శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పట్టణంలోని అమరావతి బస్టాండు వద్ద ఉన్న బాబు జగజ్జీవాన్ రామ్ కార్యాలయం వద్ద జెండాను ఎమ్మార్పీఎస్ నాయకులు గరికపాటి రవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గర్నెపూడి. సాల్మన్ రాజు మరియు అమరావతి ఆటో స్టాండ్ సభ్యులు ఫాల్గొన్నారు.

పంటలను బీమా చేయించుకోండి

ప్రజాశక్తి - మాచర్ల

మండలంలోని రైతులు తాము పండించే పంటలను బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పాపకుమారి కోరారు. ఈ పథకం తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా రక్షణ అందించేలా ప్రభుత్వం రూపొందించబడింది. తుపానులు, వరదలు, కరువు వంటి సహజ విపత్తుల కారణంగా పంటనష్టపోతే, ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతుందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన స్కీం కింద ఫ్యూచర్ జనరలి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పల్నాడు జిల్లాలోని రైతులకు పంట బీమా పథకం అమలు చేయడం జరిగిందని ఈ పథకం కింద ముఖ్యంగా మిరప, కంది, వరి పంటలకు ఇన్సూరెన్స్ కల్పించినట్లు తెలిపారు. దీనికి గాను రైతులు మిరపకు రూ.360 చెల్లిస్తే రూ.90 వేలు, కందులకు రూ.40 చెల్లిస్తే రూ.20 వేలు, వరికి రూ.80 చెల్లిస్తే రూ. 40 వేలు, పత్తికి రూ.1900 చెల్లిస్తే రూ.38వేలు బీమా అందిస్తామన్నారు. మిరప, కంది పంటలకు జూలై 31లోపు, వరి పంటకు ఆగష్టు 15లోపు, పత్తి పంటకు జూలై 15 తేదీలోపు రైతులు తమ పంటలను బీమా చేయించుకోవాలని కోరారు. రైతులు నేరుగా పిఎమ్ఎఫ్‌బివై వెబ్సైట్ లేదా మొబైల్ యాప్‌లో కూడా బీమా చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్‌పాస్ పుస్తకం, పంట నమోదు ధ్రువీకరణ పత్రం, కౌలు రైతుదారులకు కౌలు రైతు కార్డు పత్రాలు తీసుకొని మీ దగ్గరలోనే మీ సేవా కేంద్రం వద్దకు వెళ్లి పంట బీమా చేయించుకోగలని కోరారు. బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నవారు బ్యాంకు లోనే బీమా చేయించుకోవచ్చునన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

పల్నాడు జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పిఅరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలలు నుండి వచ్చిన అర్జీదారులు నుండి అర్జీలను కలెక్టరు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 198 అర్జీలు అందాయని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరి ష్కారంలో ఎటువంటి జాప్యానికి తావు లేకుండా మెరుగైన పరిష్కారం చూపాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖల కు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలిం చాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ'ను వర్తింపజేయండి

ప్రజాశక్తి -పెదకూరపాడు

అర్హత కలిగిన కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపచేయాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పిడిఎఫ్), రైతు సంఘం ఆధ్వర్యంలో పెదకూరపాడు తహశీల్దార్ ధనలక్ష్మికి సోమవారం ఆయా సంఘాల ప్రతినిధులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఓసిలోని కౌలు రైతులకు కూడా వర్తింపచేయాలన్నారు. కులాలకతీతంగా కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద నగదును కౌలు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేస్తామన్నారు. ప్రతినిధులు దర్శి శేషారావు, ఎం మస్తాన్రావు, కె జాన్ బాబు, కె చిన్నా, కె సుబ్బారావు, షేక్ జానీ, కె వీరయ్య, వి జీవన్, ఆర్ దొరబాబు పాల్గొన్నారు.

పాఠశాల గ్రాంటు రూ. 4 లక్షలు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రభుత్వ పాఠశాలలకు (ఎయిడెడ్ మినహా) పాఠశాలల గ్రాంటు నాలుగు లక్షల రూపాయలు విడుదలైనట్లు ఎంఈఓ -2 శివ నాగేశ్వరరావు తెలిపారు ఈ నిధులనుంచి చాక్ పీసులు, స్టేషనరీ కొనుగోలుకు ఖర్చు చేయాల్సి ఉందన్నారు అలాగే పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కలిగిస్తుండడంతో హెచ్ఎంలకు ఆర్థిక భారం తప్పిందన్నారు ఈ నెల 10న టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశం ఉంటుందన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన దారునాయక్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం ఎత్తిపోతలలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్ దుర్గా భవానీని అడిగి తెలుసుకున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట మాచర్ల మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుండలా నాయక్, పాండు నాయక్,వెంకటేశ్వర్లు నాయక్ ఉన్నారు.

టిడిపి నాయకుడు ఏడుకొండలు మృతి

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మెరుగు ఏడుకొండలు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందడంతో పూలమాలవేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.వెయ్యి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి - పెదకాకాని

మనకు ప్రాణవాయువును అందించి, భూతాపాన్ని తగ్గించి సకాలంలో వర్షాలు పడేవిధంగా చేసే మొక్కలు పెంచే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని సెయింట్ జోసెఫ్ సీబీఎస్ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ డా.సంధ్య రాణి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాల విద్యార్థులు పలు రకాల మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారు. అనంతరం మొక్కలు పెంచడం వల్ల వచ్చే ఉపయోగాలను, వాటి పరిరక్షణ పద్ధతుల గురించి డా.సంధ్యారాణి విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరికి మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలను తెలియజేయడానికి విద్యార్థులు మొక్కలతో ర్యాలీ నిర్వహించారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

14వ వార్డులో 'తొలి అడుగు'

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 14వ వార్డులో కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజా సంక్షేమాలను వివరిస్తూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కాండ్రు శ్రీనివాసరావు, రాష్ట్ర టిడిపి మహిళా అధ్యక్షురాలు వింజమూరి ఆశాబాల, జిల్లా పద్మశాలి సాధికార సమితి సభ్యులు జన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం గడిచిన సంవత్సరం కాలంలో ప్రజలకు చేసిన కార్యక్రమాలను వివరించారు.

ఉత్సవాల్లో పాల్గొన్న షేక్ సుభాని, హజరత్ అలీ కమిటీ సభ్యులు

ఘనంగా మోహర్రం ఉత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో షేక్ సుభాని హజరత్ అలీ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మొహరం పండగ పీర్ల పంజా వద్ద జరిగాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఎండి ఇబ్రహీం, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షేక్ అక్రమ్, నియోజకవర్గ కార్యదర్శి షేక్ సుభాని, పట్టణ కార్యదర్శి షేక్ రియాజ్, హజరత్ అలీ కమిటీ సభ్యులు షేక్ రఫీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నవులూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉడా కాలనీ , గాంధీ నగర్ వద్ద గల ప్రాథమిక పాఠశాలలో కట్టేపోగు ముత్తయ్య వారి తాత కట్టపోగు బెన్ని జ్ఞాపకార్థం స్థానిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, అందజేయడం జరిగింది. ముఖ్య అతిథులుగా గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు, కారుమంచి రామారావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వెంకట్, హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, రుద్రు కోటేశ్వరరావు,స్థానిక టిడిపి నాయకులు కొత్త శ్రీనివాసరావు, ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి పఠాన్ అబ్దుల్ ఖాన్, నవులూరు గ్రామ సీనియర్ నాయకులు తెల్ల మేకల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు వైఎస్సార్ అండ్ కె.వి.ఆర్ వాటర్ ప్లాంట్ పక్కన గల ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారాలతో పేరుకుపోయి ప్రమాదభరితంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీసం చుట్టూ పెన్షన్ కూడా లేదు. పెద్దలు ముఖ్యంగా పిల్లలు అటు వైపు వెళ్లారు జరా భద్రం కొడుకు అంటున్నారు స్థానికులు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ప్రాంతం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూత పేరుకుపోయిన చెత్తాచెదారాల వలన ప్రమాదకరంగా మారింది అని స్థాని కులు అసంతఅప్తి వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్ఫ్రార్మర్ చుట్టూ వ్యర్థ పదార్థాలు వేయడం వలన అది ఎప్పుడు అగ్నికి ఆహుతి అవుతుందో అని స్థానికులు భయంతో వణికి పోతున్నారు. ఎంటిఎంసి అధికారులతో పాటు విద్యుత్ సిబ్బంది ఆచెత్తను తొలగించి, ట్రాన్స్ఫ్రార్మర్ చుట్టూ ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించాలని, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించాలని సబ్‌కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - తెనాలి

నివేశన స్థలాలు ఇప్పించాలని స్థాని 14, 16, 17 వార్డుల ప్రజలు సబ్ కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం అందజేరు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మొత్తం 15 అర్జీలు స్వీకరించినట్లు సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు. రెవెన్యూపరమైన సమస్యలు-7, మున్సిపల్ పరమైన-3, విద్యుత్ సమస్యలపై-2, పోలీస్ శాఖాపరంగా-2 పంచాయతీ పరిధిలో ఒక ఫిర్యాదు స్వీకరించినట్లు చెప్పారు. సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) ఆధ్వర్యంలో పట్టణంలోని 14, 16, 17 వార్డులకు చెందిన పలువురు నివేశన స్థలాలు ఇప్పించాలని కోరారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో నివేశన స్థలాలు మంజూరు పత్రాలు ఇచ్చారు కానీ స్థలం చూపించలేదని సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇచ్చిన పట్టా ప్రకారం స్థలం చూపించాలని, అలా కుదరని పక్షంలో నివేసిన స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) జిల్లా కార్యదర్శి ఎం.పనిరాం దేవ్, వై.లక్ష్మీనారాయణ, జి.వెంకటసుబ్బయ్య, చావలి గోపాల్, ఈసుబ్, బి.శ్రీరామ్, కె.నాగమల్లేశ్వరి, సిహెచ్.నాగలక్ష్మి, డి.సతీష్ పాల్గొన్నారు.

వినపతిపత్రం అందజేస్తున్న స్థానికులు

గ్రీవెన్స్‌కు ప్రజా సమస్యలపై 8 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 8 అర్జీలు స్వీకరించినట్లు తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో సోమవారం సర్వే సమస్యలపై-3, కుటుంభ సమస్యలపై-3, విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదస్థాయిలో ఉన్నట్లు-1, ఆధార్ సమస్యపై-1 ఒక అర్జీ స్వీకరించినట్లు తెలిపారు. తమ భూములను ప్రభుత్వ సర్వేయర్లతో మాత్రమే భూ సర్వే నిర్వహించుకోవాలని తహశీల్దార్ సూచించారు. ప్రైవేటు సర్వేయర్లు కొలిచిన భూ కొలతల్లో స్వల్ప మార్పులు తలెత్తిన ఇరువర్గాల కుటుంబాల్లో ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రయివేటు సర్వేయర్లను సాధ్యమైనంత వరకు ఆశ్రయించవద్దని సూచించారు.

ఘనంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2025-2026 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి నూతన అధ్యక్షునిగా శెట్టి రామకృష్ణ, కార్యదర్శిగా జెట్టి శ్రావణి,కోశాధికారిగా కావూరి నగేష్, వైస్ ప్రెసిడెంట్ గా సుకుమార్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా శెట్టి కేశవరావు,క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా బొంతు అప్పిరెడ్డి, మెంబర్షిప్ డైరెక్టర్‌గా డాక్టర్ అమరేంద్ర, ఫౌండేషన్ చైర్మన్‌గా గోపు నాగ రాజేష్, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా శంకర్ శెట్టి రమేష్, యూత్ సర్వీస్ కళ్ళం రాజశేఖర్ రెడ్డి, గ్రీటింగ్స్ చైర్ పర్సన్ డాక్టర్ స్వాతి, సర్జెంట్గా చంద్రశేఖర్ రెడ్డి ఎన్నికయ్యారు. సర్వీస్ ప్రాజెక్ట్ డిస్ట్రిక్ట్ చైర్మన్ వడ్లమాని రవి, ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్టిక్ 3150 అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్రరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సభ్యులు జంగాల వెంకటే చంద్ర ఓబైమ్మలారెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని శివాలయంలో జరుగుతున్న నిత్య అన్నదానానికి గుంటూరుకు చెందిన పి.వి మల్లికార్జున రావు సోమవారం పి.ఫణిరాఘవేంద్ర జ్ఞాపకార్థం 1,16,000 విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.దాతలకు ప్రత్యేక దర్శనం,వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

దాతలను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కమిషనర్ పిజిఆర్ఎస్‌లో నాలుగు అర్జీలు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒక అర్జీ, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు, శానిటేషన్ విభాగానికి సంబంధించి ఒక అర్జీ ప్రజల నుండి స్వీకరించినట్లు చెప్పారు. వాటిని పరిశీలించి త్వరిత గతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫార్మా-డిలో నూరుశాతం ఫలితాల సాధించిన ఎఎస్ఎన్ కళాశాల

ప్రజాశక్తి - తెనాలి

జె.రాజకుమారి, బి.ఎస్తేర్

స్థానిక బుర్రిపాలెం రోడ్డు లోని ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ఫార్మా-డి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట రమణ సోమవారం తెలిపారు. కళాశాల నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో రెండవ సంవత్సర విద్యార్థిని జె. రాజకుమారి, మూడవ సంవత్సర విద్యార్థినిలు డి.శ్రీచక్రి, బి.ఎస్తేర్, నాలుగవ సంవత్సర విద్యార్థిని ఐ.నీలిమ, ఐదో సంవత్సర విద్యార్థి పి.భగవాన్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులను అభినందించారు. అలాగే ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి

తొలి అడుగు ద్వారా అభివృద్ధి సందేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా రాష్ట్రంలో జరిగిన మంచిని ప్రజలకు వినిపించి, పంచుకునేలా తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఐదవ రోజు స్థానిక 18, 19 వార్డులతో పాటు పెదరావూరు గ్రామంలో ఆలపాటి పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువుగా పింఛన్లు, ఆధార్ కార్డులో మార్పులు, తొలగింపులపై ఫిర్యాదులు చేశారు. అనంతరం ఆలపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ప్రజాసమస్యలను తొలిఅడుగు ద్వారా ప్రజలు వినిపించారని అన్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందించి కూటమి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, మహిళ నేతలు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల తమ కళాశాలలో పలు కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 20 మంది విద్యార్థులకు రూ.3 లక్షల నుండి రూ.6 లక్షల ప్యాకేజితో కూడిన ఉద్యోగాలు లభించాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్ పేర్కొన్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకూ 852 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సోమవారం కళాశాల అధ్యాపకులు అభినందించారు. కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు, అధ్యాపకులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

గుంటూరులో ఎఎన్‌ఎంల ఆందోళన

కౌన్సెలింగ్‌లో అన్యాయం జరిగిందని నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్‌ఎంలకు పలుమార్లు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో తమకు అన్యాయం జరిగిందని పలువురు మహిళలు సోమవారం రాత్రి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ లో జిల్లా ఆరోగ్య శాఖ అధికారి, వారి సిబ్బంది అవకతవకలకు పాల్పడి తమకు నష్టం చేస్తున్నారని ఎఎన్‌ఎంలు ఆరోపించారు. అధికారుల చర్య వల్ల తాము నష్టపోయామంటూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తక్షణమే అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన ఏఎన్‌ఎం లో బదిలీల్లో గందరగోళం ఏర్పడింది. ఐదేళ్ల క్రితం సచివాలయాల్లో నియమితులైన ఎఎన్‌ఎంలకు ఇటీవల పదోన్నతి కల్పించారు. పోస్టింగ్‌లు ఇచ్చారు. తిరిగి తాజాగా జరిగిన బదిలీల్లో మళ్లీ మార్పులు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. పరస్పర విరుద్ధంగా తమకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారని పలువురు ఎఎన్‌ఎంలు వాపోతున్నారు. ఇటీవల జరిగిన సచివాలయం ఏఎన్‌ఎంల బదిలీల్లో రాజకీయ జోక్యం అధికంగా ఉందన్న ఆరోపణలు వచ్చాయి. మొత్తం 986 మంది సచివాలయ ఏఎన్‌ఎంలు కొద్దిమంది మినహా మిగిలిన వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది మార్చి 17న జిల్లాలో 266 మందికి గ్రేడ్ త్రీ నుంచి ఎంపీహెచ్‌ఎఫ్ గా పదోన్నతి కల్పించి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి స్థానాలు కేటాయించారు. అయితే తాజాగా సోమవారం మళ్ళీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రూపొందించిన జాబితాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ నిరసనకు దిగారు.

కమిషనర్‌కు అర్జీ అందచేస్తున్న సిపియం నాయకులు

సుందరయ్య నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 41వ డివిజన్ పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపియం నాయకులు నగర కమిషనర్‌కు అర్జీ అందచేశారు. కాలనీలో సిమెంట్ రోడ్లు వేయాలని, కమ్యూనిటీ హాలు, పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాలుగా నిరుపేదలో ప్రభుత్వభూమిలో నివాసం ఉంటున్నారన్నారు. ఇటీవల 1, 2, 5 లైన్లలో సిమెంటు రోడ్లు వేశారని, 3వ లైన్‌లో అసంపూర్తిగా వేశారన్నారు. అలాగే 4 నుండి 6 లైన్ల వరకూ సిమెంటు రోడ్లు వేయాల్సి ఉందన్నారు. కావున అన్ని రోడ్లలో సిమెంట్ రోడ్డు వేయాలని కోరారు. అలాగే 10వ లైన్‌లో సైడు కాలువ నిర్మాణం చేయాలని కోరారు. సుందరయ్య నగర్‌కు వెళ్లే మెయిన్ రోడ్డు సిమెంట్ రోడ్డు వేశారనీ, రోడ్డు మార్జిన్‌లో డస్ట్‌తో నింపకపోవటం వల్ల రోడ్డు పగిలిపోతుందని, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కాలనీలో నిర్మించిన కామన్ మరుగుదొడ్లు ప్రజలకు ఉపయోగపడేట్లేదని, తాగుబోతులకు, దొంగలకు ఆసరాగా మారిందని, కావున మరుగుదొడ్లు తొలగించి, ఆ స్థలంతోపాటు దాని ఎదురుగా ఖాళీ స్థలాన్ని కలిపి, కమ్యూనిటీ హాల్‌గానీ, పార్క్‌గానీ నిర్మించాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించి, పరిశీలిస్తామన్నారు.అర్జీ ఇచ్చిన వారిలో పుచ్చలపల్లి సుందరయ్య నగర్ అభివద్ధి కమిటీ కార్యదర్శి ఆది నికల్సన్, సభ్యులు షేక్ ఖాశిం షహీద్, బాడిశ నాగరాజు, పి మురళి పాల్గొన్నారు.

రేపటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

జులై 9న సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు తెలిపారు. సోమవారం సమ్మెకు మద్దతుగా దుగ్గిరాల మండలంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని మంచికలపూడిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యవసాయంగానికి తీరని అన్యాయం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. గ్రామసభల ఆధారంగా కౌలు రైతులను గుర్తించాలని, భూ యజమాని సంతకం లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఇవ్వాలని, పంట నష్టపరిహారం, పంటల బీమా, పంటలు అమ్ముకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాత ప్రభుత్వం చెప్పుల్లో కాళ్లు పెట్టి నడుస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించటాన్ని వ్యతిరేకించాలని, ఆ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఇళ్లకు వస్తే వెనక్కి తిప్పి పంపాలని గ్రామస్తులను కోరారు నాయకులు బాలరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని నిధులు తగ్గిస్తుందని చెప్పారు కాబట్టి ఉపాధి హామీ పథకం రక్షణ కోసం 9వ తేదీ జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు వై బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతుల సంఘం నాయకులు అమ్మిరెడ్డి, అద్దంకి పాములు, ఏసు పాదం, వై రవీంద్రబాబు, రత్తయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

మంచికలపూడిలో మాట్లాడుతున్న ఎం హరిబాబు

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 259 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని, ఎలాంటి సందర్భంలో కూడా బియండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్లకుండ చూడాలని విధులలో నిర్లక్ష్యంగా ఉండేవారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఇ.డి. శ్రీనివాస్, డిఆర్‌ఓ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు ప్రజల నుండి 259 పిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుందరయ్య నగర్ వాసులకు ఇళ్ల పట్టాలివ్వాలి

గత 18 ఏళ్లుగా గుంటూరు, 41వ డివిజన్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపియం నాయకులు, కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్జీ అందచేశారు. కాలనీ కమిటీ అధ్యక్షులు ఎ.నికల్సన్, సిపియం శాఖ కార్యాదర్శి జి.లూదర్‌ఫాల్ మాట్లాడుతూ 18 ఏళ్లగా ఎలాంటి అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు నివశిస్తున్నామని, పట్టాలు ఇచ్చి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ 5500 ఇళ్ళపట్టాలు ఇచ్చే కార్యక్రమంలో సుందరయ్య నగర్‌లోని ఇళ్లకు కూడా పట్టాలు ఇస్తామని, కావున అందుకు తగిన

ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఓను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు షేక్.మస్తాన్ వలి, బి.లక్ష్మణరావు, సాగర్, నాగరాజు, మురళి, యోహాను, విజయలక్ష్మి,లక్ష్మీ తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి

ఆగస్టు 15 నుండి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు కల్పిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆటో డ్రైవర్ల ఉపాధికి ప్రత్యామ్నాయం చూపాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు బాడుగలు తగ్గుతాయని, కావున పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించా లని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 21ని సవరించి అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాహన ఫిట్నెస్ ప్రైవేటు వ్యక్తులకు కాకుండా రవాణా శాఖ నిర్వహించాలని కోరారు. ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం వర్తింప చేయాలని, ప్రత్యామ్నాయం ఉపాధి అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం చూపించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో ఫెడరేషన్

రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి, నగర కార్యదర్శి జి.శంకర్, షేక్.ఇస్మాయిల్, కె.కొండలు తదితరులున్నారు.

సొంత స్థలంలో దౌర్జన్యంగా సిమెంట్ రోడ్డు నిర్మాణం..

తాడికొండ గ్రామంలో, పాత సినిమా హాల్ ఎదురు రోడ్‌లో ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్డును మా సొంత స్థలంలో నిర్మించారని కనగాల పూర్ణచంద్రరావు, స్రవంతి ఫిర్యాదు చేశారు. 330 గజాల స్థలంలో మా ఇల్లు ఉందని, గతంలో ఇక్కడ సిసి రోడ్డు నిర్మించారని, ఇటీవల మండల గ్రాంటుతో 2.9 అడుగుల ఎత్తులో సిమెంట్ రోడ్డు నిర్మిస్తూ మా సొంత స్థలంలోకి నిర్మించారని తెలిపారు.పంచాయతీ అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పట్లేదన్నారు. రోడ్డును ఇష్టానుసారం నిర్మించి కాలువలు నిర్మించకుండా వదిలేశారని, దీనిపై పంచాయతీ అధికారులకు విన్నవిస్తే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి స్ట్రీట్ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మా రేషన్ కార్డులో బ్యాంక్ ఉద్యోగి పేరు చేరింది

హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో తప్పుగా తమకు తెలియని వ్యక్తి రేషన్ కార్డులో చేరారని, ఫలితంగా తాము పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చిందని తెనాలి మండలం, గుడివాడకు చెందిన కె.గగారిన్ అర్జీ అందజేశారు. తూర్పు గోదావరి ప్రాంతానికి చెందిన వ్యక్తి హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో మా రేషన్ కార్డులో చేరారన్నారు. జగజ్జీవన్ జ్యోతి యోజన పథకం కింద ఉచిత కరెంటు పొందుతున్నాను. అయితే హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ తప్పుతో ప్రస్తుతం విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులకు ఈ విషయం తెలిపి అతన్ని తమ కార్డు నుంచి తొలగించాలని కోరుతున్నా స్పందించట్లేదని తెలిపారు. అతని గురించి విచారించగా, బ్యాంక్ ఉద్యోగం కలిగి, 4వీలర్ వెహికల్ అతనికి ఉన్నట్లు తెలిసిందన్నారు. కావున సదరు వ్యక్తిని తమ రేషన్ కార్డు నుండి తొలగించాలని కోరారు.